అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

# కావ్య ఘన విజయం

## రెండు లక్షలకు పైగా మెజార్టీ

గెలుపొందిన కడియం కావ్య

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధిః వరంగల్ ఎంపీ స్థానంలో ఈవీఎంలలో మొత్తం ఓట్లు 12,55,435 పడగా బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేష్ కు 3,55,875 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థికి కడియం కావ్య కు 5,75,566 ఓట్లు సాధించారు. బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్ కుమార్ కు 2,30,820 ఓట్లు పడ్డాయి. 2,19,691 మెజార్టీతో కావ్య బీజేపీ అభ్యర్థి రమేష్ పై విజయం సాధించారు. కావ్యకు 5,728, రమేష్ కు 5,080 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పడ్డాయి. పోస్టల్ బ్యాలెట్లలో 420 చెల్లని ఓట్లు, 162 తిరస్కరణకు గురైన బ్యాలెట్ ఓట్లు ఉన్నాయి. వరంగల్ పార్లమెంట్ సభ్యులురాలుగా ఎన్నికైన కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యకు రిటర్నింగ్ అధికారి ప్రావీణ్య ధ్రువీకరణ పత్రం అందించారు. ఆమె వెంట దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే లు కడియం శ్రీహరి, రేవురి ప్రకాష్ రెడ్డి,నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ కె ఆర్ నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణి తదితరులు ఉన్నారు.

– మహబూబాబాద్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవితపై విజయం సాధించారు. వరంగల్ పార్లమెంట్ నియోజక పరిధిలోని పాలకుర్తి, స్టేషన్ ఘనపూర్ , వరంగల్ పశ్చిమ, పరకాల, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, భూపాలపల్లి అసంబ్లీ సెగ్మెంట్లకు చెందిన స్ట్రాంగ్ రూములను కేంద్ర ఎన్నికల కౌంటింగ్ అబ్జర్వర్లు బండారి స్వాగత్ రణవీర్ చంద్, రాజేష్ కుమార్, ఎన్నికలో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో మంగళవారం ఉదయం 6 గం.లకు ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ లోని లెక్కింపు కేంద్రంలో తెరిచారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఉ 8 గం.లకు పోస్టల్ బ్యాలెట్ ల లెక్కింపు, ఈవీఎం ల లెక్కింపు చేపట్టారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించుటకు కౌంటింగ్ పరిశీలకులుగా వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, భూపాలపల్లి అసంబ్లీ సెగ్మెంట్లకు బండారి స్వాగత్ రణవీర్ చంద్, పాలకుర్తి, స్టేషన్ ఘనపూర్, పరకాల అసంబ్లీ సెగ్మెంట్లకు రాజేష్ కుమార్ ల ఆధ్వర్యం లో తొలి రౌండ్ లెక్కింపు నుండి గెలుపొందిన అభ్యర్థికి ధృవపత్రం అందజేసే వరకు సమీక్షించారు. రౌండ్ రౌండ్ కు తగు సలహాలు సూచనలు ఇస్తూ తీసుకోవలసిన జాగ్రత్తలను పరిశీలకులు వివరించారు. కౌంటింగ్ ముగిసిన తర్వాత తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి తగు సూచనలు చేశారు. వినియోగించిన ఈవీఎంలను, వీవీ ప్యాట్లను వాటి నుండి ఓటు వేయడం ద్వారా లభించిన ఓటు స్లిప్పులను విడదీసి పోలింగ్ కేంద్రాల వారిగా ఆయా నియోజకవర్గంలోని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచేందుకు పటిష్ఠ పోలీస్ ఎస్కార్ట్, బందోబస్తు నడుమ తరలించినట్లు రిటర్నింగ్ అధికారి ప్రావీణ్య పేర్కొన్నారు. మంగళవారం జరిగిన లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా ఏలాంటి ఇబ్బంది లేకుండా సజావుగా జరగడం చాలా సంతోషమని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలు నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ జారీ చేసినప్పటి నుండి లెక్కింపు ప్రక్రియ ముగిసే వరకు ఏడు అసంబ్లీ సెగ్మెంట్ల కు జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సహాయ ఉఎన్నికల అధికారులు, విధులు నిర్వహించిన సిబ్బంది, ప్రజలను, జిల్లా యంత్రాంగం సలహాలు, సూచనల సమాచారం ఎప్పటికప్పుడు ప్రజలకు చెరవేసిన మీడియా ప్రతినిధులను ఆర్ ఓ, కలెక్టర్ ప్రావీణ్య అభినందించారు. ఓట్ల లెక్కింపులో జయశంకర్ భూపాలపల్లి, హనుమకొండ, జనగామ జిల్లాల కలెక్టర్లు భవేశ్ మిశ్రా, సిక్తా పట్నాయక్, షేక్ రిజ్వాన్ బాషా, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా , జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాఖడే, అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, సంధ్యారాణి, డిసిపిలు, రెవిన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రఘువీర్ రెడ్డి రికార్డు

## నల్లగొండ లోక్ సభ స్థానం నుంచి 5.51 లక్షలకు పైగా మెజారిటీ

అక్షర దర్బార్, నల్గొండ: పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో నల్లగొండ అభ్యర్థి అత్యధిక మెజారిటీ సాధించి, తెలుగు రాష్ట్రాల్లోనే అత్యధిక మెజారిటీ సాధించిన వ్యక్తిగా రికార్డు నమోదు చేసుకున్నారు. గతంలో జగన్ పేరుపై ఉన్న ఈ రికార్డును ఇప్పుడు రఘువీర్ రెడ్డి బీట్ చేశారు. లోక్ సభ ఎన్నికల ఫలితాల్లో భాగంగా నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి భారీ మెజారిటీతో విజయం సాధించారు. నల్లగొండ లోక్ సభ స్థానం నుంచి 5.51 లక్షలకు పైగా మెజారిటీ సాధించి తెలుగు రాష్ట్రాల్లో భారీ మెజారిటీ సాధించిన వ్యక్తిగా రికార్డు తన ఖతాలో వేసుకున్నారు. 2011లో జగన్ కడప లోక్ సభ ఉప ఎన్నికల్లో భాగంగా 5.43 లక్షల మెజారిటీ సాధించి, తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక మెజారిటీ సాధించిన ఎంపీగా రికార్డు తన పేరుపై నమోదు చేసుకోగా.. ఈ ఎన్నికల్లో రఘువీర్ రెడ్డి ఆ రికార్డును బ్రేక్ చేశాడు. ఇదిలా ఉండగా ఈ రికార్డులు నమోదు చేసిన ఇద్దరు కూడా కాంగ్రెస్ సీనియర్ నాయకుల వారసులే కావడం గమనార్హం. ఒకరు మాజీ సీఎం, దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమారుడు కాగా.. మరోకరు కాంగ్రెస్ సీనియర్ నేత కుందూరు జానారెడ్డి కుమారుడు. అంతేగాక నల్లగొండ పార్లమెంట్ స్థానంలో ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో అత్యదిక మెజారిటీ సాధించింది కూడా రఘువీర్ రెడ్డే కావడం విశేషం. 1952 లో నల్గొండ పార్లమెంట్ నుంచి కమ్యూనిస్టు అభ్యర్థి రావి నారాయణరెడ్డి 3,09,162 ఓట్లు ఆధిక్యత సాధించగా.. నేడు కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్ రెడ్డి 5.51 లక్షల మెజారిటీతో ఆ రికార్డును కూడా తన ఖాతాలో వేసుకున్నారు.

# మృతురాలి కుటుంబానికి బియ్యం అందజేత

అక్షయ దర్బార్, దుగ్గొండి: మృతురాలి కుటుంబానికి గ్రామ కాంగ్రెస్ నాయకులు సోమవారం బియ్యం అందజేశారు. దుగ్గొండి మండలం మర్రిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గాజు చిన్నరాజయ్య తల్లి మల్లమ్మ ఇటీవల మృతి చెందింది. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కుంట రాజుకుమార్ ఆధ్వర్యంలో నాయకులు 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో డాగం శివాజీ, గొర్రె రవి, గాజు పెద్ద రాజయ్య , పొన్నాల రాజిరెడ్డి, ముద్దం రవి, భాషబోయిన సంజీవ, ఇట్టబోయిన ఐలయ్య, దానం శంకరయ్య, వంగ రమేష్, డ్యాగం నర్సింగరావు, చవ్వాని రాజు, యూత్ నాయకులు రంపీస చిరంజీవి, పొన్నాల మైపాల్, గాజు శివాజీ, అల్లాపురం ప్రదీప్, కుక్కమూడి రాజేందర్, గట్ల రాజు, గైకోటి నాగరాజులు తదితరులు పాల్గొన్నారు

నినాదాలు చేస్తున్న టీడీపీ నాయకులు

# ఏపీలో కూటమి గెలుపుపై సంబురాలు

అక్షర దర్బార్, పరకాల: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగు దేశం, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించడంతో పరకాలలో టీడీపీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. టీడీపీ నేత కందుకూరి నరేష్ మాట్లాడుతూ.. ఏపీ ప్రజలు అరాచక పాలనకు అంతం పలుకుతూ, అభివృద్ధికి స్వాగతం చెప్పారని అన్నారు. కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ కార్యదర్శి కేదాసి స్వామి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి నల్ల రవి, ఆత్మకూరు మండల అధ్యక్షుడు గోనె మధుకర్, ప్రధాన కార్యదర్శి పెల్లి రమణ, ఎన్టీఆర్ అభిమాని చీదురాల రామన్న, ఆంజనేయులు, జిల్లా తెలుగు యువత నాయకులు కొక్కరకొండ కుమారస్వామి, 11వ డివిజన్ ప్రెసిడెంట్ నీలం పరశురాములు, బీసీ సెల్ కార్యదర్శి సిద్దోజు రాజమౌళి, రమేష్ కందుకూరి, రాజమౌళి, గీసుకొండ మండల ప్రెసిడెంట్ తాటి సాంబశివరావు, సాంబ రెడ్డి, ఎలుక సమ్మయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కంటోన్మెంట్ అసెంబ్లీ కాంగ్రెస్ ఖాతాలోకి

అక్షర దర్బార్, సికింద్రాబాద్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానం కాంగ్రెస్ ఖాతాలోకి వెళ్ళింది. కంటోన్మెంట్ ఎమ్మెల్యే మరణించడంతో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు.తెలంగాణ వ్యాప్తంగా బీఆర్ఎస్ డీలా పడిపోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి.. పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని చూసినా నిరాశే ఎదురైంది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లోనూ ఓటమి పాలైంది. సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయి కార్యర్తల్లో నిరాశ నింపింది. ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్ గెలుపొందారు. గత నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడి నుంచి బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేగా గెలిచిన లాస్య నందిత మృతితో ఇక్కడ ఉప ఎన్నికల అనివార్యమైన సంగతి తెలిసిందే.

# తెలంగాణలో మోడీ ప్రభావం

## భారీగా పుంజుకున్న బీజేపీ ఓటు బ్యాంకు

## కలిసొచ్చిన మోడీ ప్రచారం

## డబుల్ అయిన సీట్లు

## సంబురాల్లో కమలం శ్రేణులు

అక్షర దర్బార్, హైదరాబాద్: ఈ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా తెలంగాణలో మోడీ 8 లోక్ సభ స్థానాల్లో ప్రచారం చేపట్టారు. కాగా అందులో 7 పార్లమెంట్ సెగ్మెంట్లలో బీజేపీ గెలుపొందింది. ఆదిలాబాద్, మెదక్, సికింద్రాబాద్, మల్కాజ్ గిరి, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్ లో కమలం పార్టీ విజయం సాధించింది. మోడీ ప్రచారం చేపట్టిన జహీరాబాద్, నాగర్ కర్నూల్, వరంగల్, హైదరాబాద్ లోక్ సభ స్థానాల్లో బీజేపీ ఓటమి చవిచూసింది. చేవెళ్లలో బిజెపి గెలుపొందింది. తెలంగాణలో ప్రధాని మోడీ ఏప్రిల్ నుంచి మే వరకు మూడు నెలల్లో మొత్తం 8 సార్లు తెలంగాణలో పర్యటించారు. మోడీ తొలుత మల్కాజ్ గిరిలో రోడ్ షో నుంచి తెలంగాణలో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. రోడ్ షోలు, బహిరంగ సభలతో తెలంగాణ కేడర్ లో జోష్ నింపారు. పార్లమెంట్ ఎన్నికల వేళ ప్రధాని తెలంగాణలో అత్యధిక పర్యటనలు సాగించారు. మార్చిలో ఐదుసార్లు, ఏప్రిల్ లో ఒకసారి, మేలో రెండుసార్లు మోడీ తెలంగాణలో పర్యటించారు. మార్చి 4న ఆదిలాబాద్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు భారీ బహిరంగ సభలో పాల్గొన్నారు. మార్చి 5న సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారిని దర్శించుకొని సంగారెడ్డికి వెళ్లారు. సంగారెడ్డి పటాన్ చెరులో పలు అభివృద్ధి పనులతో పాటు పబ్లిక్ మీటింగ్ కు హాజరయ్యారు. మార్చి 15న మల్కాజ్ గిరిలో రోడ్ షో నిర్వహించారు. మార్చి 16న నాగర్ కర్నూల్ లో బీజేపీ ప్రచార సభలో మోడీ పాల్గొన్నారు. మార్చి 18న జగిత్యాలలో నిర్వహించిన బహిరంగ సభకు మోడీ హాజరయ్యారు. ఏప్రిల్ 30న జహీరాబాద్ ఆందోల్ లో, మే 8న వేములవాడ, వరంగల్ ప్రచార సభల్లో మోడీ పాల్గొన్నారు. మే 10న మహబూబ్ నగర్ పార్లమెంట్ పరిధిలోని నారాయణపేటలో బహిరంగ సభ నిర్వహించారు. అనంతరం హైదరాబాద్ పార్లమెంట్ పరిధి ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన సభతో ప్రచారానికి ఫినిషింగ్ టచ్ ఇచ్చారు.